సాక్షి జనగామ

శుక్రవారం | 8 | సెప్టెంబర్ | 2023

న్యూస్‌రీల్

2024 వరకు వీహెచ్‌పీ షష్టిపూర్తి వేడుకలు



జనగామ రూరల్: కృష్ణాష్టమి నుంచి 2024 వరకు వీహెచ్‌పీ షష్టిపూర్తి వేడుకలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు మంచాల రవీందర్ తెలిపారు. వీహెచ్‌పీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని గీతా ఆశ్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వీహెచ్‌పీ 1964లో ఆర్ఎస్ఎస్ 2వ చీఫ్ శ్రీగురూజీ నేతృత్వంలో ఆవిర్భవించిందని, నేటి వరకు అనేక శాఖలుగా దేశవ్యాప్తంగా విస్తరించిందన్నారు. గోమాత రక్షణకు, అయోధ్య రామాలయ నిర్మాణానికి విశేషంగా కృషి చేస్తున్నదని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బాలనారాయణ, సత్యం, కార్యకర్తలు పాల్గొన్నారు.

హక్కుల అమలుకు పోరాడాలి



దేవరుప్పుల: గిరిజనుల సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు రాజ్యాంగం కల్పించిన హక్కుల అమలుకు పోరాటం చేయాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో ఈనెల 9న తలపెట్టిన సేవాలాల్ సేన ఆవిర్భావ సభ కరపత్రాలను ఆయన గురువారం ధర్మగడ్డ, ధారావత్ తండాల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేవాలాల్ సేన సుదీర్ఘ పోరాటంతోనే గిరిజన తండాలను ప్రభుత్వం గ్రామపంచాయతీలుగా గుర్తించిందని చెప్పారు. తెలంగాణ సర్కారు గిరిజనులకు ఇచ్చిన 12శాతం రిజర్వేషన్ హామీతోపాటు పలు న్యాయపరమైన డిమాండ్ల సాధన కార్యాచరణ రూపొందించేందుకు నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మూడ అంజినాయక్, ధారావత్ రవి, దేవ్, రమేష్, కీమా, మూడ సోమన్న, దేవేందర్, సతీష్, భీమేష్‌నాయక్, సజ్జన్‌నాయక్, నరేష్, మంత్యా, కిషన్‌నాయక్, నవీన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కాంట్రాక్టు లెక్చరర్ల దీక్షలు



కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలన భవనం ఎదుట చేపట్టిన నిరసన దీక్షలు గురువారం కొనసాగాయి. వారికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ బొంద్యాలు సంఘీభావం తెలిపి మాట్లాడారు. అనేక ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు లెక్చరర్ల జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుడు భిక్షపతి మాట్లాడారు. దీక్షలో డాక్టర్ మధుశ్రీ, డాక్టర్ రఘునందన్‌రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్ కూర్చున్నారు. వారికి చిర్ర రాజు, చందులాల్, ఆర్డీ.ప్రసాద్, మధుకర్‌రావు, నాగయ్య తదితరులు మద్దతు తెలిపారు.

అంతర్జాతీయ సదస్సు వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



హసన్‌పర్తి: కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో అక్టోబర్ 6, 7వ తేదీల్లో నిర్వహించనున్న స్కోపస్ ఇండెక్షన్ అంతర్జాతీయ సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి, ఈసీఈ విభాగం ప్రొఫెసర్ రమాదేవి, కన్వీనర్లు డాక్టర్ రాముడు, డాక్టర్ సౌజన్య, ప్రొఫెసర్ డాక్టర్ రఘోత్తంరెడ్డి, కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ ప్రభాకరాచారి తదితరులు పాల్గొన్నారు.

కాళోజీకి సముచిత గౌరవం

- చీఫ్ విప్ వినయ్‌భాస్కర్

నయీంనగర్: కాళోజీ గౌరవాన్ని మరింత పెంచేలా సీఎం కేసీఆర్ అనేక నిర్ణయాలు తీసుకున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. గురువారం 'కుడా' కార్యాలయ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాళోజీ శత జయంతి సందర్భంగా వరంగల్‌లో రూ.50 కోట్లతో 2.25 ఎకరాల్లో రాష్ట్రంలోనే అతిపెద్ద కళాక్షేత్రాన్ని నిర్మించేందుకు సీఎం శంకుస్థాపన చేశారన్నారు. కాళోజీని గుర్తుంచుకునేలా హెల్త్ యూనివర్సిటీకి కాళోజీ నారాయణరావు పేరు పెట్టామన్నారు. హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. అనుకూల వాతావరణం లేక, వర్షాల వల్ల కళాక్షేత్రం నిర్మాణం కాస్త ఆలస్యమైందని, త్వరలో పూర్తవుతుందన్నారు. ఈనెల 9న హనుమకొండ హరిత హోటల్‌లో కాళోజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు, కవులు, కళాకారులకు అవార్డులతో సత్కరించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. కాళోజీ మిత్రమండలి కార్యదర్శి అంపశయ్య నవీన్ మాట్లాడుతూ.. ఈఏడాది పురస్కారానికి సింగర్ జయరాజ్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, నాగుర్ల వెంకన్న, గ్రంథాలయ చైర్మన్ అజీజ్‌ఖాన్, కాళోజీ మిత్రమండలి సభ్యులు అశోక్‌రావు, విద్యార్థి, పొట్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జనగామ: శ్రీమత్ భగవద్గీతాశ్రమంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు



పాలకుర్తిలో ఉట్టి కొడుతున్న యువకులు



గోపాల..గోపాల

- మరిన్ని చిత్రాలు 9లో

చిన్ని కృష్ణుల బోసి నవ్వులు.. బాలగోపికల ఆటపాటలు.. కోలాటాలు, నృత్య ప్రదర్శనలు.. జిల్లాలో ఎక్కడ చూసినా బాలగోపాలుల సందడే కనిపించింది. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా గురువారం జనగామ పట్టణంతోపాటు జిల్లా వ్యాప్తంగా చిన్ని కృష్ణులు, గోపికల వేషధారణలో చిన్నారులు అలరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శ్లోకాలు, కూచిపూడి నృత్యాలు తదితర పోటీల్లో ప్రతిభను కనబరిచారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. అలాగే పట్టణ కేంద్రాల్లో నిర్వహించిన ఉట్లు కొట్టే వేడుకల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. - జనగామ

శ్రమకు గుర్తింపేది..?

- సర్కారు ఉద్యోగులతో సమానంగా విధుల నిర్వహణ
- క్రమబద్ధీకరణకు నోచుకోని 'సమగ్ర శిక్ష ఉద్యోగులు'
- కనీస వేతన స్కేల్ డిమాండ్‌తో ఆందోళన బాట
- జిల్లా వ్యాప్తంగా నిలిచిన సేవలు



జనగామలో దీక్ష చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

జనగామ : ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వర్తిస్తూ.. క్రమబద్ధీకరణకు నోచుకోకుండా.. కనీస వేతనాలు కరువైన ఏళ్ల తరబడి చాకిరీ చేస్తున్న 'సమగ్ర శిక్ష ఉద్యోగులు' తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన బాట పట్టారు. విద్యాశాఖలో దశాబ్దంన్నర కాలంగా కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న వీరు శాంతియుతంగా చేపట్టిన నిరసన రిలే దీక్షలతో ఎమ్మార్సీలకు తాళం పడే పరిస్థితి ఏర్పడింది. పదిరోజులుగా అనేక రూపాల్లో నిరసన తెలిపినా సర్కారు నుంచి స్పందన లేకపోవడంతో గత్యంతరం లేక తాము రోడ్డెక్కాల్సి వచ్చిందని వారు అంటున్నారు.

విద్యాశాఖలో కీలక పాత్ర

విద్యాశాఖలో సమగ్ర శిక్ష ఉద్యోగుల పాత్ర కీలకం. పాఠశాల స్థాయి నుంచి జిల్లా వరకు రోజువారీ కార్యకలాపాల్లో వీరు లేకుండా ఏ ఒక్క పని కూడా ముందుకు సాగదు. జిల్లా స్థాయిలో అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్, సిస్టం అనలిస్ట్, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, మండల విద్యాశాఖలో ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, కాంప్లెక్స్ పరిధిలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు, పాఠశాలల్లో వృత్తి విద్యాబోధన చేసే పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లుగా వేర్వేరు విభాగాల్లో పని చేస్తున్నారు. వీరికి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సుప్రీం కోర్టు గతంలో ఆదేశించినా రాష్ట్రంలో అమలుకు నోచుకోవడం లేదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడగానే కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరిస్తానని తెలంగాణ ఉద్యమ సమయంలో హామీ ఇచ్చిన కేసీఆర్ మాట నిలబెట్టుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ఎమ్మార్సీలకు తాళాలు..

మండల విద్యా వ్యవస్థలో వందశాతం కాంట్రాక్టు ఉద్యోగులే ఉన్నారు. న్యాయమైన డిమాండ్ల సాధనకు సమగ్ర శిక్ష ఉద్యోగులు రోడ్డెక్కడంతో ఎమ్మార్సీ కేంద్రాలకు తాళాలు పడ్డాయి. ఎక్కడి పనులు అక్కడే నిలిచి పోయాయి. పాఠశాలల్లో పని చేసే బోధకులు సైతం నిరసన ప్రకటించడంతో.. చదువులకు అంతరాయం ఏర్పడుతోంది. మధ్యాహ్న భోజనం బిల్లులు, విద్యార్థుల ప్రగతి నివేదికలు, 'మనఊరు-మనబడి', యూడైస్ నివేదికలు స్తంభించి పోయాయి. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల సమయంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న టీచర్ల వివరాలను మండల విద్యా వనరుల కేంద్రానికి అప్పగించాల్సి ఉంది. అలాగే ఉపాధ్యాయుల సమగ్ర సమాచారాన్ని క్రోడీకరించి జిల్లా స్థాయికి పంపించాల్సి ఉంటుంది. అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్లు, సిస్టం అనలిస్ట్‌లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు జిల్లా స్థాయిలో జరిగే నివేదికలను రాష్ట్ర స్థాయికి పంపిస్తారు. పాఠశాలల్లో విద్యార్థులకు వృత్తి విద్యకు సంబంధించి కుట్లు, అల్లికలు, చిత్రలేఖనం, ఇతర కోర్సులను పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు బోధిస్తారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆందోళనలో ఉండడంతో సమ్మె జఠిలంగా మారింది.

జిల్లాలో సమగ్ర శిక్ష ఉద్యోగుల వివరాలు

మొత్తం ఉద్యోగులు :	427
కేజీబీవీ, యూఆర్ఎస్ సిబ్బంది :	278
పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు :	53
కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్లు :	43
ఐఈఆర్‌పీలు :	20
డాటా ఎంట్రీ ఆపరేటర్లు :	11
ఎంఐఎస్ కోఆర్డినేటర్లు :	9
మెసెంజర్లు :	9
డీఈఓ కంప్యూటర్ ఆపరేటర్లు :	2
జిల్లా విద్యాశాఖ అటెండర్లు :	2

ఇవీ డిమాండ్లు ..

- రెగ్యులరైజ్ చేయడంతోపాటు కనీస వేతనం అమలు చేయాలి.
- పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లను ఒకేషనల్ ఉపాధ్యాయులుగా గుర్తించాలి
- వృత్తి విద్య ఉపాధ్యాయులందరికీ 12 నెలల పూర్తి వేతనం చెల్లించాలి
- మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలి
- ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా సౌకర్యాలు, ఈహెచ్ఎస్ కల్పించాలి
- ఉద్యోగి మరణిస్తే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించాలి
- కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లకు సమాన వేతనం చెల్లించాలి

ఉద్యోగ భద్రత కల్పించాలి..



సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లను ఒకేషనల్ టీచర్లుగా మార్చాలి. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలి. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అనుసరించి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి.

- చేపూరి అనిల్, సంఘం జేఏసీ ప్రతినిధి

రెగ్యులరైజ్ చేయండి



సమగ్ర శిక్ష ఉద్యోగుల నియామకం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగింది. ఇప్పుడు ఆ రాష్ట్రంలో రూ.30,500 వేతనం తీసుకుంటున్నారు. తెలంగాణలో పని చేస్తున్న వారికి రూ.19,500 వేతనం అందుతోంది. రెగ్యులరైజ్ చేయడంతోపాటు కనీస వేతన స్కేలు అమలుచేయాలి.

- బైరగోని దయాకర్‌గౌడ్, జేఏసీ ప్రతినిధి

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్



సంఘీభావం తెలుపుతున్న టీపీటీఎఫ్ నాయకులు

జనగామ: విద్యాశాఖ సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సూర్యాపేట రోడ్డులో నాలుగు రోజులుగా సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న దీక్షల శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించి సంఘీభావం ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ అన్ని అర్హతలున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయడం లేదన్నారు. అంతకుముందు ఉద్యోగులు శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని తమ డిమాండ్లు నెరవేర్చాలని చిన్న కృష్ణుడి వేషధారణలో ఉన్న బాలుడికి పత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్.రాజు, బాధ్యులు వజ్రయ్య, అంకుశావళి, శ్రీరామ్, వెంకన్న, ప్రభాకర్, రాజేందర్, రాజారెడ్డి, రాజయ్య, లక్ష్మణ్, గణేష్, వరప్రసాద్, నరసింహనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

- సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్



జనగామ పట్టణంలో రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

జనగామ రూరల్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అన్నారు. కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. పట్టణంలోని నెహ్రూ పార్క్ వద్ద పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించడంలో పాలకులు విఫలమయ్యారని, ఏళ్ల తరబడి రేషన్ కార్డులు లేక పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వృద్ధులు, కొత్తగా వివాహం చేసుకున్న వారికి కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేషన్ షాపుల్లో 18 రకాల సరుకులు అందించాలని, అర్హులందరికీ కొత్త పింఛన్ మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బొట్ల శ్రీనివాస్, అజారుద్దీన్, వెంకటేష్, వెంకటమల్లయ్య, లింగం తదితరులు పాల్గొన్నారు.

జోడో యాత్రతో ప్రజల్లో భరోసా..



జనగామ పట్టణంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న కొమ్మూరి, పార్టీ శ్రేణులు

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కారు మతం పేరిట విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయాలు చేస్తున్న తరుణంలో రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్ర ప్రజలకు భరోసా కల్పించిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ 'భారత్ జోడో యాత్ర' చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా కొమ్మూరి ఆధ్వర్యంలో గురువారం స్థానిక రైల్వే స్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 145 రోజులు.. 12 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు.. 4వేల పైచిలుకు కిలోమీటర్లు సాగిన పాదయాత్ర కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్తేజాన్ని నింపిందన్నారు. కార్యక్రమంలో పాలకుర్తి నియోజవర్గ నాయకులు ఝాన్సీరెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి బండ సుధాకర్‌గౌడ్, నాయకులు వేమెళ్ల సత్యనారాయణరెడ్డి, కంచె రాములు, జిల్లెల్ల సిద్దారెడ్డి, ఉడుత రవియాదవ్, మేడ శ్రీనివాస్, నల్ల శ్రీ రాములు, గంగం నర్సింహరెడ్డి, వంగాల మల్లారెడ్డి, ధర్మ గోవర్ధన్‌రెడ్డి, సుంకరి శ్రీనివాస్‌రెడ్డి, బనుక శివరాజ్, కొమ్ము నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

నియోజకవర్గం బాధ్యుల ఆధ్వర్యాన..

టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య ఆదేశాల మేరకు జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ ఆధ్వర్యాన గురువారం జిల్లా కేంద్రంలో పట్టణ, మండల కమిటీ నేతృత్వంలో రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు కొన్నె మహేందర్‌రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు బడికే ఇందిరా కృష్ణస్వామి, జక్కుల వేణుమాధవ్, చింతకింది మల్లేష్, జాఫర్ షరీఫ్, మాజీద్, తోట సత్యం, కట్ట కృష్ణ, కామునిశ్రీను, రంగు రవి, రఘు ఠాకూర్, సర్వర్, శ్రీనివాస్, పిట్టల రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీ అమలు చేయాలి

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చందు



సమావేశంలో మాట్లాడుతున్న చందు

జనగామ రూరల్: రైతు ఉద్యమం సందర్భంగా కేంద్రం లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఆది సాయన్న, భూక్య చందు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చందు మాట్లాడుతూ.. 2021లో రైతులకు ప్రధాని మోదీ లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీ కారణంగా రైతులు ఉద్యమాన్ని తాత్కాలికంగా నిలిపి వేశారని, అయితే సమస్యలు పరిష్కరించకుండా మోదీ రైతులను మోసం చేశారని విమర్శించారు. దేశంలో రైతు సమస్యలపై రెండో విడత ఉద్యమం చేపట్టాలని సంయుక్త కిసాన్ మోర్చా నిర్ణయించిందని, ఇందులో భాగంగా ఈనెల 30న జిల్లా సదస్సు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపేందర్, గట్టుమల్లు, మిట్యానాయక్, సోమయ్య, వెంకట్‌రెడ్డి, పరశరాములు, పద్మ, వజ్రమ్మ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'గిరిజన భూములతో ఎమ్మెల్యే ముత్తిరెడ్డికి సంబంధం లేదు'



పట్టాదారు పాసుపుస్తకాలు చూపుతున్న బాధిత గిరిజన రైతులు

తరిగొప్పుల: గిరిజన భూములకు ఎమ్మెల్యే ముత్తిరెడ్డికి ఎలాంటి సంబంధంలేదని బొత్తలపర్రె గ్రామానికి చెందిన రైతులు అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో ప్రొఫెసర్ తిరుపతినాయక్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిపై భూకబ్జా ఆరోపణలు చేసిన నేపథ్యంలో వారు గురువారం మండలకేంద్ర అంబేడ్కర్ విగ్రహం ఎదుట విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అమాయక గిరిజన రైతుల భూములు కబ్జాకు పాల్పడింది ఎమ్మెల్యే కాదని, గ్రామానికి చెందిన నిజాం కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ భూక్య తిరుపతినాయక్ కబ్జాదారుడని పేర్కొన్నారు. తమ సామాజిక వర్గానికి చెందిన నిరక్షరాస్యులైన గిరిజనులను మోసం చేసిన తిరుపతినాయక్ వారి సంతకాలను ఫోర్జరీ చేసి.. తన కుటుంబీకులు గతంలో అమ్మిన భూములకు తిరిగి దొంగతనంగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందాడని ఆరోపించారు. ఇలా ఆ భూములను కబ్జా చేయాలని ప్రయత్నించగా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి గిరిజనులకు అండగా నిలిచారని, దీంతో తిరుపతినాయక్ అక్కసుతోనే ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దేవ్‌సింగ్, బాధిత రైతులు భూక్య స్వరూప, దేశ్యా, శారద, రవీందర్, రాజు, తిరుపతి, సువాలీ, భాగ్యమ్మ, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులకు భయపడేది లేదు


- కార్యకర్తలకు అండగా ఉంటా..
- కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డి



కార్యకర్తల సమస్యలు వింటున్న ఝాన్సీరెడ్డి

కొడకండ్ల: అధికార దుర్వినియోగం చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, మంత్రి దయాకర్‌రావు తమ పార్టీ కార్యకర్తలను బెదిరింపులకు గురి చేస్తున్నారు.. బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. పోలీసులు తీసుకెళ్లిన మండల పరిధి మైదంచెరువుతండాకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలను బుధవారం రాత్రి ఆమె పరామర్శించి మాట్లాడారు. స్థానికంగా కాంగ్రెస్ జెండా గద్దె నిర్మిస్తున్న క్రమంలో కార్యకర్తలను అధికార బీఆర్ఎస్ నాయకుల ప్రోద్బలంతో పోలీసులు తీసుకెళ్లారని అన్నారు. నిష్పక్షపాతంగా వ్యవహరించకుంటే సహించబోమని, కార్యకర్తలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి షేక్ అబ్దుల్లా, పార్టీ మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్, సోమనర్సయ్య, రవీందర్, హేమాని తదితరులు పాల్గొన్నారు.

డీడీలు కట్టిన వారికి గొర్రెలు పంపిణీ చేయాలి



బీరప్ప దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న జీఎంపీఎస్ నాయకులు

- జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి సాదం రమేష్

జనగామ రూరల్: డీడీలు కట్టిన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యేల జోక్యం లేకుండా గొర్రెలు పంపిణీ చేయాలని జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి సాదం రమేష్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీరప్ప దేవాలయంలో మోటే దేవేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సంఘం జిల్లా స్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండో విడత గొర్రెలు పంపిణీ చేస్తారనే ఆశలతో అప్పులు తెచ్చి డీడీ తీసి ఇచ్చిన 2,600 మంది ఏడాది కాలంగా ఎదురు చూస్తున్నారని అన్నారు. ఇచ్చిన హామీ నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని, వర్షాకాలం మూడు నెలలు గడిచినా జీవాలకు మందులు పంపిణీ చేయలేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 11న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం తలపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జి.యాదగిరి, జి.వెంకటయ్య, బి.కుమారస్వామి, బి.అజయ్, ఎం.నాగరాజు, వి.ఐలయ్య, వీరమల్లయ్య, నర్సయ్య, గట్టయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోస్టల్ శాఖ శుభవార్త..

- 'డాక్ ఘర్ నిర్యత్' కేంద్రం ద్వారా విదేశాలకు వస్తువుల చేరవేత

హన్మకొండ: విదేశాలకు వస్తువులు, పార్శిళ్లు చేరవేసే వ్యక్తులు, సంస్థలకు పోస్టల్ శాఖ శుభవార్త తెలిపింది. తక్కువ ఖర్చుతో సులభ పద్ధతిలో త్వరగా విదేశాలకు వస్తువులు పంపేందుకు తపాలా శాఖ 'డాక్ ఘర్ నిర్యత్' కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. హనుమకొండ డివిజన్‌లోని జనగామ, భూపాలపల్లి, ములుగు, హనుమకొడ ప్రధాన తపాలా కార్యాలయాల్లో 'డాక్ ఘర్ నిర్యత్' కేంద్రాలను ఏర్పాటు చేసింది. విదేశాల్లో ఉన్నత అభ్యసించేందుకు, ఉద్యోగాల కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పెద్ద ఎత్తున వెళ్తున్నారు. కుటుంబ సభ్యులు వీరికి అవసరమైన నిత్యావసరాలు పంపిస్తున్నారు. ఈ నేపథ్యంలో వీటిని సులభంగా, త్వరగా చేరవేసేందుకు తపాలా శాఖ ముందుకు వచ్చింది. నిత్యావసర వస్తువులు, ఔషధాలు, గిఫ్ట్ ఆర్టికల్స్, ఇతర సామగ్రిని ఈ 'డాక్ ఘర్ నిర్యత్' కేంద్రాల ద్వారా పంపించుకునే సౌకర్యం కల్పించింది. దీనిపై తపాలా శాఖ హనుమకొండ డివిజన్ సూపరింటెండెంట్ హనుమంతు మాట్లాడుతూ ఎగుమతి, దిగుమతి లైసెన్స్ కలిగిన సంస్థలు కూడా 'డాక్ ఘర్ నిర్యత్' కేంద్రం ద్వారా సులభంగా విదేశాలకు వస్తువులు పంపొచ్చని తెలిపారు. పార్శిల్‌ను ఇంటి వద్ద నుంచి ఉచితంగా సేకరించి పంపనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

దానాపూర్ ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ మీదుగా నడిచే సికింద్రాబాద్–దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌ను దారి మళ్లించినట్లు రైల్వే అధికారులు గురువారం రాత్రి తెలిపారు. రైల్వే ఇంజనీరింగ్ పనుల నేపథ్యంలో సెప్టెంబర్ 21 నుంచి 26వ తేదీ వరకు సికింద్రాబాద్–దానాపూర్ (12791) ఎక్స్‌ప్రెస్‌ను వయా నిజామాబాద్, నాగపూర్ మీదుగా, అదేవిధంగా సెప్టెంబర్ 17 నుంచి 21వ తేదీ వరకు దానాపూర్–సికింద్రాబాద్ (12792) ఎక్స్‌ప్రెస్ వయా నాగపూర్, నిజామాబాద్ మీదుగా దారి మళ్లిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

సైబర్ మోసం.. కేసు నమోదు

డోర్నకల్: ఆన్‌లైన్‌లో ఓ యువకుడు డబ్బు పెట్టుబడి పెట్టి మోసపోయిన ఘటనపై గురువారం డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ ఉపేందర్‌రావు కథనం ప్రకారం మండలంలోని గొల్లచర్ల క్రాస్ వద్ద రెడీమేడ్ షాప్ నిర్వహిస్తున్న సిసింద్రి ఫోన్‌లో గుర్తు తెలియని వ్యక్తుల మాటలు నమ్మి టెలిగ్రామ్ యాప్ ద్వారా పెట్టుబడి పెట్టాడు. ఆగస్టు 14న రూ. లక్షా, 20 వేలు టెలిగ్రామ్ యాప్ అకౌంట్‌లో జమ చేశాడు. తర్వాత అకౌంట్ పని చేయకపోవడంతో ఆందోళనకు గురై తనకు తెలిసిన వారిని విచారించాడు. వారి వద్ద కూడా సమాచారం లభించలేదు. దీంతో తాను మోసం పోయాయని గుర్తించిన సిసింద్రి.. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసినట్లు సీఐ తెలిపారు.

అమాంతం ఆకాశానికి..

6వ తేదీన కూరగాయల ధరలకు రెక్కలు

- టెండర్ నిర్వహణతో మార్కెట్‌లో పెరిగిన రేట్లు
- రైతు బజార్‌లో నష్టపోయిన స్థానిక రైతులు
- చిల్లర, రిటైల్, కమీషన్ వ్యాపారులు దూరం
- సరుకులు రాకపోవడంతో తగ్గిన మార్కెట్ ఫీజు



టెండర్ రోజున వ్యాపారులు, వినియోగదారులు లేక వెలవెలబోతున్న లక్ష్మీపురం కూరగాయల మార్కెట్

వరంగల్ : వరంగల్ లక్ష్మీపురం మార్కెట్‌లో 6వ తేదీన (బుధవారం) కమీషన్ వ్యాపారుల సంఘం నిర్వహించిన టెండర్ వల్ల కూరగాయలు తక్కువగా రావడంతో ధర అమాంతం ఆకాశానికి పెరిగింది. టెండర్‌లో పాల్గొని రూ.4.78 లక్షల దక్కించుకున్న వ్యాపారులు మాత్రమే కూరగాయలను రిటైల్ వ్యాపారులకు విక్రయించారు. దీంతో మాములు రోజుల కంటే ప్రతి కూరగాయ కేజీకి రూ.20 నుంచి 40 వరకు ధర పెరగడంతో వినియోగదారులపై భారం పడింది. జిల్లాలోని పలు ప్రాంతాల కూరగాయల రైతులు.. రైతు బజార్‌లో వ్యాపారులకు విక్రయిస్తారు. టెండర్ అమలు రోజున టెండర్ దారులే కొనుగోలు చేయడం వల్ల ధర పడిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని రైతు బజార్‌కు తీసుకువచ్చిన రైతులు వాపోతున్నారు. 5వ తేదీన వంకాయ టిక్కి (25కిలోలు) రూ.400–500 విక్రయించగా టెండర్ రోజు 6వ తేదీన కేవలం రూ.200కే విక్రయించారు. అదే విధంగా టమాట బాక్స్ రూ.300కు కొనుగోలు చేసిన వ్యాపారులు టెండర్ రోజున ధర రూ.600 పెట్టి కొనుగోలు చేశారు. హోల్‌సేల్‌లో ఎక్కువ ధరకు కొనుగోలు చేయడం వల్ల కేజీకి రూ.10–30 పెంచి విక్రయించామని వ్యాపారులు తెలిపారు. టెండర్ వల్ల ధర పెరగడంతో అదనపు భారం పడిందని వినియోగదారులు వాపోయారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న టెండర్‌పై చర్యలు తీసుకోవాలని వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు.

మార్కెట్ వైపు రాని వ్యాపారులు..

గణపతి నవరాత్రుల నిర్వహణ పేరుతో టెండర్ నిర్వహించొద్దని అరిచిగోల పెట్టినా కొంత మంది నాయకులు పట్టించుకోలేదు. నిబంధనలకు విరుద్ధంగా టెండర్ నిర్వహించడంతో 80 శాతం మంది వ్యాపారులు రాలేదు. ఫలితంగా మార్కెట్ బోసిపోయింది. మార్కెట్‌కు రాని వారిలో కమీషన్, హోల్‌సేల్, మినీ హోల్‌సేల్‌తో పాటు రిటైల్, చిరు వ్యాపారులు ఉన్నారు. సుమారు 400మందికి పైగా వ్యాపారులు మార్కెట్ వైపు చూడలేదు. దీనిపై మార్కెటింగ్ అధికారులు స్పందించి టెండర్ నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తగ్గిన సరుకు..పెరిగిన ధరలు..

మార్కెట్‌కు 5వ తేదీన 7,720 క్వింటాళ్ల కూరగాయలు రాగా రూ. 15, 524, 6వ తేదీన కేవలం 220 క్వింటాళ్లు రాగా రూ.5635, 7వ తేదీన 11, 596 క్వింటాళ్ల సరకు రావడంతో రూ.22,935 ఆదాయం మార్కెట్‌కు సమకూరింది. అంటే టెండర్ రోజున తక్కువ సరుకు రావడంతో పెద్ద మొత్తంలో మార్కెట్ ఆదాయానికి గండి పడింది.

రూ. నాలుగు వేలు నష్టం



టెండర్ నిర్వహించడం వల్ల రూ. నాలుగు వేలు నష్టపోయా. టెండర్ నిర్వహించిన విషయం మాకు తెలియదు. రోజూ మాదిరిగానే మార్కెట్‌కు కూరగాయలు తీసుకొచ్చాను. సగం ధరకే కొంటామని చెప్పడం, మిగిలిన వ్యాపారులు లేక పోవడంతో టెండర్ పొందిన వ్యక్తికే అమ్మాను. వినాయక విగ్రహం పెట్టేందుకు చందాలు వసూలు చేయాలే తప్పా ఇలా టెండర్ నిర్వహిస్తే మేం నష్టపోతున్నాం.

–బొల్లం సదయ్య, రైతు, వంచనగిరి

ధర పెంచారు



కూరగాయల ధర అమాంతం పెంచి విక్రయించారు. ధర ఎందుకు పెరిగిందంటే టెండర్ వల్ల అని వ్యాపారులు చెప్పారు. ఈవిధానం ఎక్కడా చూడలేదు. టెండర్‌తో వినియోగదారులు నష్టపోతున్నారు.

–మోతీలాల్, వినియోగదారుడు, కాశిబుగ్గ

చట్టాన్ని అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదు

- వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్
- కేయూ ఘటనలో వీసీతో కలిసి ప్రెస్‌మీట్
- పారదర్శకంగా పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు–వీసీ



మాట్లాడుతున్న సీపీ రంగనాథ్

వరంగల్ క్రైం: చట్టాన్ని అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం హనుమకొండ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో కాకతీయ యూనివర్సిటీ వీసీతో కలిసి ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కేయూ వీసీ కళ్లలో ఆనందం చూడడానికి ఏబీవీపీ విద్యార్థులను స్వయంగా గన్‌తో బెదిరించడంతో పాటు తీవ్రంగా కొట్టినట్లు వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. కొంత మంది ఏబీవీపీ విద్యార్థులు వీసీ చాంబర్ తలుపులు పగులగొట్టి గదిలో ఉన్న కంప్యూటర్లు పగలగొట్టి విధ్వంసం సృష్టించారని తెలిపారు. కేయూలో అనేక విద్యార్థి సంఘాలు ఉన్నాయని, అందులో ఏబీవీపీ ఒకటని, అందులో కూడా అందరూ మంచివారేనని, ఐదురగురు విద్యార్థులు మాత్రమే బెదిరించి హక్కులు సాధించుకోవాలనే ఉద్దేశంతో గొడవలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. అలాంటి విద్యార్థులపై కఠినంగా ఉంటామని సీపీ పేర్కొన్నారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులను లాగే క్రమంలో ఏమైనా దెబ్బలు తగలొచ్చని, అది విధి నిర్వహణలో భాగమే అన్నారు. కుల మతాలు, రాజకీయ పార్టీలకతీతంగా లాండ్ ఆర్డర్ పని చేస్తుందని సీపీ రంగనాథ్ స్పష్టం చేశారు.

పారదర్శకంగా పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు..

కాకతీయ యూనివర్సిటీలో నాలుగు , ఐదు రోజులుగా జరుగుతున్న ఘటనలు తనను చాలా బాధించాయని వీసీ తాటికొండ రమేష్ తెలిపారు. పీహెచ్‌డీ ఇంటర్వ్యూలను అత్యంత పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు. ఇంటర్వ్యూల్లో ఎక్కడా తప్పులు దొర్లకుండా ఉండేందుకు వీడియో రికార్డు చేసినట్లు వీసీ పేర్కొన్నారు. కానీ కొంత మంది విద్యార్థులు దౌర్జన్యంగా అడ్మిషన్లు పొందేందుకు ముందుకు వస్తున్నారన్నారు. ఎవరికీ భయపడమని, నిబంధనల మేరకు.. రిజర్వేషన్ల ఆధారంగా అడ్మిషన్లు చేపడుతామని తెలిపారు. సమావేశంలో ఎంజీఎం ఆర్ఎం2 డాక్టర్ మురళి, హనుమకొండ ఏసీపీ కిరణ్, ఎస్‌బీ ఏసీపీ జితేందర్‌రెడ్డి, కేయూ రిజిస్ట్రార్ సత్యనారాయణ, కేయూ సీఐ అబ్బాయ్య, ఎస్సైలు సురేష్, సుమన్ పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల జేఏసీ నిరసన దీక్ష

- కాంగ్రెస్, బీజేపీ నేతల సంఘీభావం
- కేయూ వీసీ తీరుపై మండిపాటు
- 12న ఉమ్మడి జిల్లా బంద్‌కు జేఏసీ పిలుపు



దీక్ష చేస్తున్న విద్యార్థి సంఘాల జేఏసీ బాధ్యులకు సంఘీభావం తెలుపుతున్న వివిధ పార్టీల నేతలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ రెండో కేటగిరీలో జరిగిన అక్రమ అడ్మిషన్లపై విచారణ జరిపించాలని, పీహెచ్‌డీ అడ్మిషన్ల అక్రమాలపై ప్రశ్నించిన విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసుతో దాడిచేయించిన వీసీని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ కేయూ ఎస్‌డీఎల్‌సీఈ ఆవరణలో విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం నిరసన దీక్ష చేపట్టారు. కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్, సామాజికవేత్త కూరపాటి వెంకటనారాయణ దీక్షను ప్రారంభించి, మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, చాడ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మంద శ్యామ్, రీజినల్ కోఆర్డినేటర్ కన్నం సునీల్, ధర్మసమాజ పార్టీ నాయకుడు సుమన్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు డాక్టర్ వలీఉల్లా ఖాద్రి సంఘీభావం తెలిపారు. విద్యార్థులపై దాడులకు పాల్పడిన టాస్క్‌ఫోర్స్ పోలీసులను సస్పెండ్ చేయాలని, కేయూలో నియమించిన ఆంధ్రా ప్రాంతానికి చెందిన రిజిస్ట్రార్‌ను తక్షణమే తొలగించాలని, న్యాక్ పేరుతో అభివృద్ధి పనుల పేరిట కేయూలో జరిగిన అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గాయపడిన విద్యార్థి సంఘాల నాయకులు మాచర్ల రాంబాబు, ఆరెగంటి నాగరాజు, మట్టెడ కుమార్, మధులతోపాటు ప్రజాసంఘాలు, వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు దీక్షలో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. శుక్రవారం నుంచి వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టి, ఈనెల 12న ఉమ్మడి వరంగల్ జిల్లా బంద్‌కు పిలుపునిస్తున్నట్లు కేయూ విద్యార్థి సంఘాల జేఏసీ బాధ్యులు ప్రకటించారు.

కేయూ అధికారుల ధోరణిని ఖండిస్తున్నాం

యూనివర్సిటీలోని విద్యార్థి సంఘాల నాయకులపై యూనివర్సిటీ అధికారులు అనుసరిస్తున్న ధోరణిని అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ (అకుట్) ఖండిస్తుందని అకుట్ అధ్యక్షుడు ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి గురువారం ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసుల దాడిని నిరసిస్తూ ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో హనుమకొండలోని అమరవీరుల స్తూపం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, ప్రశాంత్, సిద్దు, వినయ్, ప్రభు, రవీందర్ కృష్ణ, సందీప్, విజయ్, మురళి, ప్రసాద్‌రాజు, స్వామి పాల్గొన్నారు.

భారీగా గంజాయి పట్టివేత



మాట్లాడుతున్న ఏసీపీలు డేవిడ్ రాజు, మధుసూదన్

- ఎనిమిది మంది అరెస్ట్
- నాలుగు కార్లు, ద్విచక్రవాహనం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీలు

హసన్‌పర్తి: ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తున్న ఓ ముఠాను టాస్క్‌ఫోర్స్, హసన్‌పర్తి పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.30 లక్షల మేర సరుకును స్వాధీనం చేసుకున్నారు. నాలుగు కార్లతో పాటు ద్విచక్రవాహనం సీజ్‌చేసినట్లు కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలి పారు. హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్లాపురం వద్ద ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిండగా పెట్రోలింగ్ సిబ్బందిని చేధించుకుంటూ నాలుగు కార్లు ముందుకు సాగాయి. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారిని వెంబడించి పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచా రించగా ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తున్నట్లు అంగీకరించారు. కార్లను తనిఖీ చేయగా అందులో నుంచి 150 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. దీంతో వర్పు తండా చిన్న వంగరకు చెందిన డ్రైవర్ ధర్మవత్ రవి, దేశాయిపేటకు చెందిన డ్రైవర్ చిలుక సురేష్, తొర్రూరు మండలం అమర్‌సింగ్‌తండాకు చెందిన గుగులోత్ హరిసింగ్, జాటోత్ చందు, ప్రవీణ్, మహారాష్ట్ర అమరావతికి చెందిన సలావుద్దీన్, అజాన్‌ఖాన్, షేక్ సమీర్‌ను అరెస్ట్‌చేసినట్లు ఏసీపీలు డేవిడ్ రాజ్, మధుసూదన్ తెలిపారు.

ఉత్కంఠగా గ్రీస్ పోల్ అధిరోహణ



బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

హన్మకొండ: గ్రీస్ పోల్ అధిరోహణ ఉత్కంఠగా సాగింది. హనుమకొండ గాంధీనగర్‌లో యాదవ సంఘం, పోచమ్మ దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో గురువారం కృష్ణ జన్మాష్టమీ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్పొరేటర్ నల్ల స్వరూప రాణి ముఖ్య అతిథిగా హాజరై వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉట్టి కొట్టేందుకు యువకులు పోటీ పడ్డారు. అనంతరం గ్రీస్ పోల్ అధిరోహణ కార్యక్రమం నిర్వహించారు. గ్రీస్ అద్దిన ఐరన్ స్తంభాన్ని యువకుల బృందం అధిరోహిస్తుండగా పట్టు లభించలేదు. పలుమార్లు కిందికి జారారు. దీంతో గోకుల్‌నగర్‌కు చెందిన యువకులు ఒకరిపై మరొకరు నిలబడి చివరకు ఉట్టి కొట్టారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్ఈ నల్ల సుధాకర్ రెడ్డి, షైన్ విద్యా సంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్, గాంధీనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకటరాజిరెడ్డి, గోకుల్ యాదవ సంఘం గౌరవ అధ్యక్షుడు బొల్లు సత్యం, అధ్యక్షుడు బంక రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ హత్య కేసులో వ్యక్తి అరెస్ట్

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌కు చెందిన రౌడీ షీటర్ ఎస్‌డీ నజీర్ (37)ను హత్య చేసి పరారైన వ్యక్తిని ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేశారు. ఉత్తర్ ప్రదేశ్‌లోని దేవరియా జిల్లా బేగంచ్ ఘాట్ పీఎస్ చెందిన రామ్‌జీ వికాస్ సోనిని గురువారం ఉదయం వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో అదుపులోకి తీసుకుని మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వికాస్‌సోని.. వరంగల్ శివనగర్‌లోని తిరుమల్ బార్ పక్కన ఓ గదిలో అద్దెకు ఉంటున్నాడు. వరంగల్ రైల్వేస్టేషన్‌లో కీచైన్స్, పర్సులు, ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువులు విక్రయిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ వస్తువులు విక్రయిస్తున్న నేపథ్యంలో కొంత కాంట్రాక్ట్ డబ్బులు చెల్లించాలని రౌడీషీటర్ నజీర్.. వికాస్ సోనిని ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. దీంతో నజీర్‌ను ఎలాగైనా హత్య చేసి తన అడ్డు తొలగించుకోవాలని వికాస్‌సోని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా గత నెల 30న అర్ధరాత్రి పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న నజీర్.. కాంట్రాక్ట్ డబ్బులు అడిగేందుకు వికాస్ సోని వద్దకు చేరుకున్నాడు. దీంతో ఆగ్రహానికి లోనైన వికాస్ సోని.. రాడ్‌తో నజీర్ తలపై బలంగా కొట్టగా ఆయన అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు గురువారం ఉదయం వికాస్ సోనిని అరెస్ట్ చేశారు. అనంతరం హత్య గల కారణాలను సేకరించి రిమాండ్‌కు తరలించినట్లు తెలిసింది. దీనిపై సీఐ సురేష్‌ను ఫోన్‌లో వివరణ కోరగా వికాస్ సోనిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కేయూ విద్యార్థి నేతల రిమాండ్

- 8మందికి బెయిల్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని, ఆయా అడ్మిషన్లను రద్దు చేసి సమగ్ర విచారణ జరిపించాలని ఈనెల 5న ప్రిన్సిపాల్ ఆఫీస్ వద్ద వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు ఆందోళన చేసిన విషయం విధితమే. ఈసందర్భంగా జరిగిన ఘటన నేపథ్యంలో పోలీసులు పలువురు విద్యార్థి సంఘాల బాధ్యులను అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి ఈనెల 6న హనుమకొండ జిల్లా మూడో మున్సిఫ్ కోర్టులో ఆయా విద్యార్థిసంఘాల నాయకులను ప్రవేశపెట్టగా తమను టాస్క్ పోలీసులు తీవ్రంగా కొట్టారని వారు జడ్జి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మళ్లీ వైద్య పరీక్షలు చేయించాలని పోలీసులను జడ్జి ఆదేశించారు. ఈ నేపథ్యంలో విద్యార్థి సంఘాల నాయకులకు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించగా.. నలుగురికి గాయాలైనట్లుగా వైద్యులు గుర్తించారు. అనంతరం ఎంజీఎం నుంచి జడ్జి ఎదుట ప్రవేశపెట్టేందుకు తరలించడంలో పోలీసులు జాప్యం చేశారు. దీంతో విద్యార్థి నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. వాహనంలో అటుఇటు తిప్పి హనుమకొండ హంటర్ రోడ్డులోని ఆ మున్సిఫ్ కోర్టు మహిళా జడ్జి ఎదుట ప్రవేశపెట్టేసరికి బుధవారం అర్ధరాత్రి దాటింది. ఎంజీఎం ఆస్పత్రి వైద్యులు ఇచ్చిన రిపోర్టును పరిశీలించి గట్టు ప్రశాంత్, అంబాల కిరణ్‌లను రిమాండ్ చేసి, మరో 8మందికి బెయిల్ ఇచ్చారు. బెయిల్ పొందినవారిలో మాచర్ల రాంబాబు, ఆరెగంటి నాగరాజు, లకావత్ అజయ్‌కుమార్, కె.శ్రీకాంత్, ఎస్.మధు, జి.కమల్, అంకిళ్ల శంకర్, మట్టెడ కుమార్ ఉన్నారు.

ముదిరాజ్ రిజర్వేషన్ల అంశాన్ని మేనిఫెస్టోలో చేర్చాలి

- మెపా రాష్ట్ర అధ్యక్షుడు కొత్తగట్టు శ్రీనివాస్



వినతిపత్రం అందజేస్తున్న మెపా నాయకులు

హన్మకొండ: ముదిరాజ్ రిజర్వేషన్ల అంశాన్ని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చేర్చాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొత్తగట్టు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ కోరారు. ఈమేరకు గురువారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డితో మెపా ప్రతినిధుల బృందం భేటీ అయింది. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డికి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించింది. ముదిరాజ్ కులస్తులకు రిజర్వేషన్ ఫలాలు అందడం లేదని, దీనిపై కాంగ్రెస్ వైఖరి ప్రకటించాలని కోరింది. రాష్ట్రంలో 60 లక్షల జనాభా ఉన్న సామాజిక వర్గానికి చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించడానికి కనీసం 10 సీట్లు కేటాయించాలని కోరింది. దీనిపై రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తుల స్థితిగతులపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. రిజర్వేషన్ బీసీ–డీ నుంచి బీసీ–ఏ లోకి మార్చడం లేదా ప్రత్యేక కేటగిరీ ఏర్పాటు అంశాన్ని తమఎన్నికల మేనిఫెస్టోలో చేరుస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 3 నుంచి 5 అసెంబ్లీ టికెట్లు కేటాయించేలా ఏఐసీసీతో చర్చిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బుర్రి సంపత్, బరిగెల భాస్కర్, మల్లిక్, పెండ్యాల కృష్ణ, జోడు ప్రదీప్, నీరటి రాజు, సింగారపు రామకృష్ణ, పోతిరెడ్డి సత్తయ్య, బీస రమేష్ పాల్గొన్నారు.

ఉదయం పోరాటం.. సాయంత్రం దుర్మరణం !

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి
- తల్లడిల్లిన భార్య, కొడుకు



రవి (ఫైల్)

లింగాలఘణపురం: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో పాల్గొన్న ఓ వ్యక్తి.. సాయంత్రం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో భార్య, కొడుకు తల్లడిల్లిన తీరు ప్రతీ ఒక్కరిని కంట తడి పెట్టించింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నెల్లుట్ల బైపాస్ బ్రిడ్జి కింద రోడ్డుపై బుధవారం రాత్రి ఆర్టీసీ బస్సు ఢీకొని జనగామ పట్టణానికి చెందిన బలుగుల రవి (30) దుర్మరణం చెందాడు. రవికి ఇల్లు లేకపోవడంతో జనగామ – సూర్యాపేట రోడ్డులో పటేల్‌గూడెం సమీపంలో సీపీఎం ఆధ్వర్యంలో వెలసిన గుడిసెల్లో నివాసం ఉంటున్నాడు. జనగామలో హోటల్‌లో పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో జరిగిన ర్యాలీలో పాల్గొన్నాడు. సాయంత్రం జనగామలో హోటల్‌లో పని చేసేందుకు నెల్లుట్ల బైపాస్ బ్రిడ్జి కింద నుంచి నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్తున్న వరంగల్–1 డిపో బస్సు ఢీకొని తల, ఛాతి పైభాగం నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రవికి భార్య, కుమారుడు ఉన్నారు. ప్రేమ వివాహం చేసుకొని కూలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న రవి మృతితో భార్య గుండెలవిసేలా విలపించింది. ఉదయం తమతో ర్యాలీలో పాల్గొని సాయంత్రం రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో సీపీఎం నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎస్సై ప్రవీణ్ ఘటనా స్థలికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ బావిలో పడింది ఎవరు?

- మోటార్లు ఎత్తుకెళ్లే దొంగలా..? మద్యం మత్తులో పడ్డారా?
- డయల్ 100కు కాల్.. ఇద్దరిని రక్షించిన పోలీసులు

ఖిలా వరంగల్: పడమరకోట శివారులో ఈనెల 4న తెల్లవారుజామున ఇద్దరు వ్యక్తులు ఓ వ్యవసాయ బావిలో పడ్డారు. దీంతో వారి వెంట ఉన్న ఓ మహిళ డయల్ 100 కాల్ చేయడంతో పోలీసులు వారిని రక్షించారు. అనంతరం విచారణ నిమిత్తం పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు గురువారం ఆలస్యంగా తెలిసింది. బావిలో పడిన వ్యక్తులు ఎవరై ఉంటారు?విద్యుత్ మోటార్లు చోరీ చేసే వారా? లేదా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తులా? అర్ధరాత్రి వారి వెంట ఆ మహిళ ఎందుకు ఉంది.. ఎందుకు కాపాడాల్సి వచ్చిందనే విషయంపై పలువురు చర్చించుకుంటున్నారు. దీనిపై ఓ స్థానిక ప్రజాప్రతినిధి ఆరా తీయగా పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచుతున్నట్లు సమాచారం. అదే రోజు రాత్రి బావి సమీపంలోనే ఓ ఔట్‌డోర్ ఫొటో స్టూడియో ప్రాంగణంలోని బోర్ మోటార్‌ను ఎత్తుకెళ్లేందుకు దొంగలు ప్రయత్నించి విఫలమైన ఆనవాళ్లు కనిపించాయని స్థానికులు చెబుతున్నారు.

కర్నూల్ నుంచి వరంగల్‌కు దొంగల తరలింపు

- పోలీస్ స్టేషన్లకు తరలుతున్న బాధితులు
- ఒకటి రెండు రోజుల్లో అరెస్ట్ చూపే అవకాశం

వరంగల్ క్రైం: నగరంలోని మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు అపార్ట్‌మెంట్‌లలో చోరీలకు పాల్పడిన దొంగలను వరంగల్ కమిషనరేట్ పోలీస్‌లు 24 గంటల్లో పట్టుకున్నారు. ఏపీలోని కర్నూల్ సరిహద్దులో దొంగల ముఠా పట్టుపడడంతో పోలీస్‌లు, బాధితులు ఊపిరిపీల్చుకున్నారు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన దొంగల ముఠా సుమారు రూ. కోటి విలువైన బంగారం చోరీ చేసిన విషయం తెలిసింది. ఈ ఘటనపై వరంగల్ పోలీస్ కమిషనర్.. మట్టెవాడ, హనుమకొండ, సుబేదారి పోలీస్ స్టేషన్లతో పాటు సీసీఎస్ అధికారులతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. ఈ బృందం.. కర్నూల్ పోలీస్‌ల అదుపులో ఉన్న దొంగల ముఠాను వరంగల్‌కు తీసుకువచ్చి విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో బాధితులు గురువారం ఆయా పోలీస్ స్టేషన్లకు చేరుకుని ఎంత మొత్తంలో చోరీ జరిగింది.. ఏఏ వస్తువులు చోరీకి గురయ్యాయే పోలీసులకు వివరించినట్లు తెలిసింది. దీంతో పోలీస్ అధికారులు బాధితులు చెప్పిన వివరాలు, దొంగలు చెప్పిన వివరాలకు లెక్కలు సరిపోయిన తరువాత ఒకటి రెండు రోజుల్లో సీపీ రంగనాథ్ ఎదుట ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు తెలిసింది. దొంగలు ఉపయోగించిన వాహనం నంబర్ ప్లేట్ ఆధారంగా వారు మొదట మధ్యప్రదేశ్‌కు చెందిన వారిగా భావించినప్పటికీ విచారణలో మాత్రం వాహనం ఉత్తర్ ప్రదేశ్‌లోని గజియాబాద్ ప్రాంతానికి చెందినదిగా తేలినట్లు తెలిసింది.

బీజేపీ టికెట్‌కు కేయూ పార్ట్‌టైం లెక్చరర్ దరఖాస్తు



దరఖాస్తు చేస్తున్న ఉమాశంకర్

కేయూ క్యాంపస్: నర్సంపేట అసెంబ్లీ బీజేపీ అభ్యర్థిగా టికెట్ కేటాయించాలని కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎంహెచ్ఆర్ఎం విభాగంలో పార్ట్‌టైం లెక్చరర్ డాక్టర్ బుర్రి ఉమాశంకర్ కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో బీజేపీ అధిష్టానానికి గురువారం దరఖాస్తు చేసుకున్నారు. ఉమాశంకర్‌ది చెన్నారావుపేట మండలం అమీనాబాద్ గ్రామం.